యువత రాజకీయాల్లోకి రావాలి

- ప్రభుత్వ విధానాలపై లోతుగా చర్చించాల్సి ఉంది
- భారత్ సమ్మిట్ ప్లీనరీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

DELIVERING GLOBAL JUST
April 26, 2025
HYDERABAD RESOLUTION

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించిపోయిందనీ, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయన్నారు. గడిచిన పదేండ్లలో దేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సి ఉందని చెప్పారు. చట్టసభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా రావడం లేదన్నారు. విపక్షాలు తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తోందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో రెండోరోజు భారత్ సమ్మిట్ ప్లీనరీ ముంగిపులో ఆయన మాట్లాడారు. దేశ రాజకీయాలు, ప్రజాస్వామ్యం, దేశం, ప్రజల పట్ల కాంగ్రెస్ పార్టీకున్న ప్రేమ, ప్రజలకు ఏం చేయాలని పార్టీ అనుకుంటుందోనని విషయాలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య రాజకీయాలు మారిపోయాయి. పదేండ్ల నాటి పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయిందనీ, ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమేనన్నారు. 'విద్వేశాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం' అని తెలిపారు. 'ప్రజలతో ఎలా మాట్లాడాలో... వారి సమస్యలు ఎలా వినాలో నేర్చుకున్నా. తాను గతంలో ఎప్పుడూ ప్రజలపై ఉన్న ప్రేమను వ్యక్తపరచలేదు. కానీ, యాత్రలో తాను ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరచగలిగాను. నేను ఎప్పుడైతే ప్రజలపై నా ప్రేమను వ్యక్తపరిచానో అప్పట్నుంచి అందరూ స్పందిస్తున్నారు' అని గుర్తు చేశారు. దేశంలో మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సమస్యల పరిష్కారానికి ప్రజలే మార్గం చూపిస్తున్నారని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు తాను మొదటి రోజు రావాల్సి ఉందనీ, కానీ కశ్మీర్‌కు వెళ్లాను అందుకే రాలేదు...తనను క్షమించాలని కోరారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు.

తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

తెలంగాణ రైజింగ్ కోసం బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని భారత్ సమ్మిట్‌లోని విదేశీ ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల జీవితాలను మార్చేందుకు రాష్ట్ర సర్కారు చేపట్టిన మిషన్‌లో చేరాలని కోరారు. మీకున్న అనుభావాలను, పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను తమ ప్రభుత్వంతో పంచుకోవాలని కోరారు. భారత్ సమ్మిట్ ప్లీనరీలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టిన పథకాలను వివరించారు. తెలంగాణకు ఎంతో గొప్ప చరిత్రతోపాటు ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ఎన్నో దశాబ్దాలపాటు పోరాడిందని గుర్తు చేశారు. విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతులు, మహిళలు ఉద్యమానికి నాయకత్వం వహించారనీ, వారి పోరాటం వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా గత పదేండ్లుగా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. తమ ఆకాంక్షల సాధన కోసం ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని తెలిపారు. భారతదేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 15 ఆగస్టు 2024న రూ. 20,617 కోట్లు చెల్లించి 25 లక్షల 50 వేల మంది రైతులను పూర్తిగా రుణ విముక్తులను చేసిందన్నారు. తమ రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు వివరించారు. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. భూమిలేని రైతుకూలీలకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.12,000 సాయం అందిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగంలో భూమిలేని, భూమి కలిగిన రైతులకు కలిపి ఏటా రూ.20,000 కోట్లకు పైగా నిధులు ఇస్తున్నామన్నారు. రైతుల పండించిన ధాన్యానికి మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామన్నారు. రైతుబీమా, పంటల బీమాలతో రైతులకు లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. తాము అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. ఐదు లక్షల మంది యువతకు ప్రయోజనం కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రయివేటు రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ ఆర్‌టిసి బస్సులు, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులను చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి మహిళను ఇంటి యజమానిని చేయనున్నట్టు తెలిపారు. మూసీ పునరుజ్జీవనంతో హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. న్యూయార్క్‌లోని హడ్సన్‌నది, లండన్‌లోని థేమ్స్‌నది, టోక్యోలోని సుమిదాతోసహా అనేక నగరాలను అధ్యయనం చేసినట్టు తెలిపారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు అనేక ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు చేపడుతున్నట్టు చెప్పారు. 30 వేల ఎకరాల్లో ప్రపంచస్థాయి నగరం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. 370 కిలోమీటర్ల పొడవైన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో రైలు విస్తరణ చేపడుతున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్ విభాగంలో థర్డ్ జెండర్‌ను రిక్రూట్ చేసుకున్న తొలి ప్రభుత్వం తెలంగాణ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు వంద దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కర్రెగుట్టలో నరమేధాన్ని ఆపండి

- నేడు, రేపు రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని వెంటనే ఆపాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కర్రెగుట్టలో కూంబింగ్‌ను వ్యతిరేకిస్తూ ఆది, సోమవారాల్లో రెండురోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి సూర్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఛత్తీస్‌ఘడ్ - తెలంగాణ సరిహద్దులో గల కర్రెగుట్ట ప్రాంతం గత నాలుగైదు రోజులుగా యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నదని తెలిపారు. ఈ సరిహద్దు ప్రాంతంలో నివాసముంటున్న ఆదివాసీ, గిరిజనులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా దాదాపు 20 వేల మంది సాయుధ పోలీస్ బలగాలు అక్కడ తిష్ట వేశాయని తెలిపారు. ప్రతిరోజూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని వివరించారు. శుక్రవారం రాత్రి నుంచి పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో 40 మందికి పైగా మావోయిస్టులు, ఆదివాసీలు హతమైనట్టు మీడియాలో వార్తలొచ్చాయని పేర్కొన్నారు. ఈ అడవులన్నీ బాంబుల మోతలతో తళ్లడిల్లుతున్నాయని తెలిపారు. కర్రెగుట్ట ప్రాంతం నుంచి అన్ని రకాల సాయుధ పోలీస్ బలగాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన ఆదివాసీ గిరిజనులని వదిలిపెట్టాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని సూచించారు. మావోయిస్టులు ఇటీవలి కాలంలో శాంతి చర్చలకు తాము సిద్ధమంటూ పదే పదే ప్రకటిస్తున్నా కేంద్ర ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలను జరపాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్ట బేస్ క్యాంపులను ఎత్తేయాలని కోరారు.



రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తి

- కటౌట్లు, ఫ్లెక్సీలలో కనిపించని హరీశ్‌రావు ఫొటోలు
- నేతల్లో కుదరని సమన్వయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తి చింతలపల్లిలో భారీగా జరపనున్న సభ నేపథ్యంలో ఆ పార్టీలోని అంతర్గత విభేదాలపై చర్చలు నడుస్తున్నాయి. భారీగా ఏర్పాట్లు చేసినప్పటికీ నేతల మధ్య సమన్వయ లోపం, పార్టీ అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం లాంటి విషయాలపై శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. అయితే, కీలక నేత ట్రబుల్ షూటర్‌గా పేరొందిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇన్ని రోజులూ సభా ఏర్పాట్ల విషయంలో అంటీ ముట్టనట్టు ఉండటం చర్చకు తావిచ్చింది. ఈ క్రమంలో శనివారం ఆయన సభాస్థలికి చేరుకొని విలేకరుల సమావేశం నిర్వహించి వెళ్లారు. అయితే, బహిరంగ సభలో ఎక్కడా హరీశ్‌రావు కటౌట్‌లకు స్థానం లేకపోవడం గమనార్హం. ఫ్లెక్సీలలో కెసిఆర్, కెటిఆర్‌ల ఫొటోలే కనిపించడంతో పార్టీ శ్రేణుల్లో పెద్దఎత్తున చర్చకు దారితీసింది.

పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి

ఎల్కతుర్తి చింతలపల్లిలో భారీగా రజతోత్సవ సభకు ఏర్పాట్లు చేసినా.. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో పార్టీ బలోపేతం కాకపోవడం ఆ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మహబూబాబాద్ జిల్లాలో సీనియర్ నేతలున్నా, సమన్వయం కుదరడం లేదు. ఎవరికివారే ఒంటెద్దు పోకడలతో మహబూబాబాద్ జిల్లా గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ములుగు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇందుకు నాయకత్వంలో లోపాలే కారణంగా ఉంది. ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పూర్తిస్థాయిలో శ్రేణులకు అందుబాటులో వుండకపోవడం, పార్టీ కార్యక్రమాలను నిర్వహించకపోవడంతో కార్యకర్తల్లో అసంతృప్తి ఉంది. రజతోత్సవ సభకు పోలీసు అధికారులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

చారిత్రాత్మక సభగా నిలిచేనా..?

బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ చారిత్రాత్మక సభగా నిలుస్తుందా ? అనే విషయంలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ చేసే ప్రకటనలు ఏ మేరకు రాజకీయాలను ప్రభావితం చేస్తాయన్న విషయంలో ఇప్పటికే రాజకీయ పరిశీలకులు ఎదురు చూస్తున్నారు. పది లక్షల మంది వస్తారంటున్నా.. ఒకవైపు ఎండలు, మరోవైపు నేతల మధ్య విభేదాలతో జన సమీకరణ అన్ని నియోజకవర్గాల్లో ఒకే పద్ధతిలో జరగడం లేదని తెలుస్తోంది.

29న డ్రా పద్ధతిన బార్ల కేటాయింపు

హైదరాబాద్ బ్యూరో : ఈ నెల 29న డ్రా పద్ధతిన బార్లను కేటాయించనున్నట్టు తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30న రాష్ట్రంలోని 25 బార్లకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 1546 మంది పోటీలో పాల్గొన్నారని తెలిపారు. అదిలాబాద్ జిల్లాలో ఒక బార్‌కు ఒకే దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. అత్యధికంగా నగరంలోని సరూర్‌నగర్ మీర్‌పేట బార్‌కు 200 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఒకే దరఖాస్తు వచ్చిన బెల్లంపల్లి బార్ గడువును మే 5 వరకు పెంచినట్టు వివరించారు.

విమానంలో వృద్ధురాలు మృతి

- వారణాసి నుంచి బెంగళూరు వెళ్తుండగా ఘటన
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విమానంలో ప్రయాణిస్తున్న వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో విమానాన్ని శంషాబాద్ ఆర్‌జిఐ ఎయిర్‌పోర్టులో శనివారం అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అవుట్ పోస్ట్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పద్మనాభనగర్ ప్రాంతానికి చెందిన తులమ్మ (76) ఈ నెల 15న తమ కుటుంబ సభ్యులు, పొరుగున ఉన్న మణిరాజుతో కలిసి ఉత్తర భారతదేశ పర్యటన కోసం ఢిల్లీకి ప్రయాణించారు. ప్రయాణం పూర్తి చేసుకున్న తర్వాత వారు 25న ఇండిగో విమానం నంబర్ 6ఇ499 ద్వారా వారణాసి నుంచి బెంగళూరుకు తిరిగి వస్తున్నారు. విమానంలో సుమారు 11:30 గంటలకు తులమ్మ అనారోగ్యానికి గురయ్యారు. ఎయిర్‌లైన్ సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స (సీపీఆర్) అందించారు. విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ కోసం మళ్లించారు. ఆమెను విమానాశ్రయంలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మరణించినట్టు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలో ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

SFI
5th sfi Telangana State CONFERENCE
తెలంగాణ రాష్ట్ర
5వ మహాసభలు

మహాసభలో మాట్లాడుతున్న నాగేశ్వర్

విద్యార్థి సమస్యల పరిష్కారానికే ఎస్ఎఫ్ఐ పరిమితం కాలేదని.. కాకూడదని ప్రముఖ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. వర్గ చైతన్యం ఇచ్చే సంఘం ఎస్ఎఫ్ఐ అని చెప్పారు. విద్యాపరమైన అసమానతలే ఆదాయపరమైన అసమానతలకు దారి తీస్తాయని.. ధనిక, పేద అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఏ సిద్ధాంతమైనా ఆచరణ నుంచి రావాలని, ఆచరణ కోసం అధ్యయనం చేయాలని సూచించారు. ఆలోచనల పోరాటంలో ఎస్ఎఫ్ఐ ముందుండాలన్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం (సీతారాం ఏచూరి నగర్)లో కొనసాగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలో రెండో రోజు శనివారం నాగేశ్వర్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజా ఉద్యమాలకు కీలక నాయకులను ఇచ్చింది ఎస్ఎఫ్ఐ అన్నారు. వర్గ చైతన్యం ఇచ్చే సంఘం ఇదే అన్నారు. ప్రభుత్వ విద్యారంగం నాడు బలంగా ఉండేదని, నాటి భిన్నత్వమే సామాజిక చైతన్యానికి కారణమై ఉండొచ్చని విశ్లేషించారు.

అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలు

ధనిక, పేద అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలు నిర్మించాలని నాగేశ్వర్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ల లాభాలు 400 శాతం పెరిగితే ఉద్యోగుల జీతాలు ఐదు శాతం మాత్రమే పెరుగుతున్నాయని తెలిపారు. 10 శాతంగా ఉన్న కార్పొరేట్లకు భారత ప్రభుత్వం రూ.1.45 లక్షల కోట్ల రాయితీలు ఇస్తోందన్నారు. తద్వారా విద్యా, ఆరోగ్యం లాంటి సామాజిక రంగాల్లో ఖర్చు పెట్టలేకపోతోందని తెలిపారు. రూ.2.2 లక్షల కోట్లు మాత్రమే సామాజిక రంగాలపై ఖర్చు చేస్తోందన్నారు. కార్పొరేట్ల నుంచి వచ్చే ఆదాయం నానాటికీ తరుగుతోందని, ఒకప్పుడు 32 శాతంగా కార్పొరేట్ల నుంచి ఆదాయం వస్తే ప్రస్తుతం 26 శాతం మాత్రమే లభిస్తోందని తెలిపారు. దేశంలో 22 కోట్ల మంది ప్రజల రోజువారీ ఆదాయం రూ.300 కన్నా తక్కువగా ఉంటే గౌతమ్ అదానికి రోజుకు రూ.1600 కోట్ల ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. ప్రధాని మోడీ సంపదను కాకుండా దారిద్రాన్ని పంచుతానంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో 40 శాతం సంపద ఒక శాతం మంది చేతిలో ఉంటే.. 50 శాతం జనాభాకు మూడు శాతం ఆదాయం మాత్రమే లభిస్తోందన్నారు. ఇలాంటి స్థితిలో ప్రజల కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించాలని సూచించారు. దేశంలో రాజ్యాంగమే సుప్రీమని తెలిపారు. పార్లమెంటుకు కూడా రాజ్యాంగాన్ని మార్చే అర్హత లేదన్నారు. లౌకికత్వం, సామ్యవాదం అనే పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యానికి మతం లేదని లౌకికత్వం చెబుతోందన్నారు. పహల్గాం ఉగ్రదాడిని బీజేపీ సోషల్ మీడియా ముస్లిం దాడిగా చిత్రీకరిస్తోందన్నారు. హార్స్ రైడర్ సయ్యద్ హుస్సేన్ షా పర్యాటకులను కాపాడిన విషయాన్ని గమనించాలని కోరారు.

నూతన విద్యా విధానం పేరుతో 300 స్కూళ్లకు మూత

సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఆదివాసీలు రాష్ట్రంలో 11 జిల్లాల్లో ఉన్నారని మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు తెలిపారు. ఈ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే విద్యా సంస్థలను మూసేస్తున్నారని చెప్పారు. నూతన విద్యా విధానం పేరుతో దాదాపుగా సంవత్సర కాలంలో 300 స్కూళ్లను మూసేశారని చెప్పారు. 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండగా, అందులో ఒక్కరంటే ఒక్కరు కూడా తెలుగు వచ్చిన ఉపాధ్యాయులు లేరన్నారు. ఏకలవ్య స్కూల్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చూస్తుంటే ఆదివాసీల విద్య పట్ల కేంద్ర ప్రభుత్వం ఎంత వివక్ష చూపుతుందో అర్థమవుతోందన్నారు. ములుగు గిరిజన విశ్వవిద్యాలయం బోర్డులకే పరిమితమైందన్నారు. భద్రాచలం ప్రభుత్వ బీఈడి కాలేజీలో సరైన స్టాఫ్ లేరన్నారు. శాస్త్రీయ విద్య, సమాజ మార్పుకు ఎస్ఎఫ్ఐ ఎనలేని కృషి చేస్తోందన్నారు.

సవాళ్ల మధ్య విద్యారంగం

ప్రస్తుతం విద్యార్థి ఉద్యమం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. కొత్త సవాళ్లు, అనేక ఆటుపోట్లు ఎదురైనా సమాజ మార్పుకు నికరంగా నిలిచిన సంఘం ఎస్ఎఫ్ఐ అని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ దృక్పథాన్ని ఇచ్చింది: ముప్వా శ్రీనివాసరావు

ఎస్ఎఫ్ఐ తనకు దృక్పథాన్ని ఇచ్చిందని ఆహ్వాన సంఘం చైర్మన్ ముప్వా క్రాంతి శ్రీనివాసరావు అన్నారు. స్వావలంబన ఇవ్వని విద్య వ్యర్థమని వివేకానందుడు అన్న మాటలను గుర్తు చేశారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యా కాషాయీకరణ చేస్తూ.. చరిత్రను మార్చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రూ.3.25 లక్షల చెక్కును ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి నాయకులు సంఘానికి అందజేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 400 గుడిసెలు అగ్నికి ఆహుతి : కోట్లల్లో ఆస్తి నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో సుమారుగా 400 గుడిసెలు కాలిబూడిదయ్యాయి. కట్టుకున్న గుడిసెలు కండ్లముందే కాలిపోతుంటే పేదలు దిక్కుతోచని స్థితిలో రోదించారు. మంటలకు సిలిండర్లు పేలడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఈ విచారకరమైన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లో శనివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేస్3లో సర్వే నెం.215 నుంచి 224లో 80 ఎకరాలకు పైగా భూదాన భూమి ఉంది. అక్కడ వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వలస వచ్చిన పేదలు సుమారుగా ఎనిమిది వేల గుడిసెలు వేసుకొని కొన్ని సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారు. శనివారం రోజువారీ పనుల్లో భాగంగా వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో ఆకస్మాతుగా ఓ గుడిసెలో నుంచి మంటలు చెలరేగి పక్కనున్న గుడిసెలకు అంటుకున్నాయి. అదే సమయంలో గుడిసెల్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌లు పేలడంతో సుమారుగా 400 గుడిసెలు కాలి బూడిదయ్యాయి. వెంటనే స్థానికులు, కాలనీవాసులు ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పెద్ద ఎత్తున పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు.

అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే వారికి ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తక్షణమే మంటలను అదుపులోకి తెచ్చాం : కేశవులు, డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్

సిగరెట్ తాగడం వల్లనా.. లేక చిన్నపిల్లలు ఆడుతూ అగ్గిపుల్లతో అంటించారా? లేక గుడిసెల్లో పూజ నిర్వహించిన అనంతరం దీపం వల్ల నిప్పు అంటుకుందా? అనేది తెలియదు. స్థానికుల నుంచి సమాచారం అందడంతో వెంటనే అప్రమత్తమై 40 మంది ఫైర్ సేఫ్టీ సిబ్బంది, ఆరు ఫైరింజన్లతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాం.

విద్వేషాన్ని పెంచుతున్న పాలకులు

- పూలే, అంబేద్కర్ జనజాతర సభలో జెబి రాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జన జాతర సభ
KVPS

సభలో మాట్లాడుతున్న జెబి రాజు

పాలకులే మనుషుల మధ్య విద్వేషాలు పెంచితే.. సమాజం శాంతియుతంగా ఎలా ఉంటుందని ప్రముఖ అంబేద్కర్ వాది జేబీ రాజు ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ మేడ్చెల్ మల్కాజిగిరి, హైదరాబాద్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జన జాతర సభను ఆ సంఘం హైదరాబాద్ అధ్యక్షులు ఎం దశరథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప మేధావని చెప్పారు. ఎక్కువ పుస్తకాలు చదివిన వారు ప్రపంచంలో ఇద్దరే ఇద్దరనీ, ఒకరు మార్క్స్ అయితే.. మరొకరు అంబేద్కరని వివరించారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని కుల వ్యవస్థ నిర్మూలన కోసం అంబేద్కర్ అవిరళ కృషి చేశారని చెప్పారు. సమానత్వం, స్వేచ్ఛ, హేతువాదాన్ని మార్క్స్, పూలే, అంబేద్కర్ అనుసరించారని వివరించారు. ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను కెవిపిఎస్ విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణకు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. పూలే, అంబేద్కర్ జన జాతర సభలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా పాటించాలని సూచించారు. పూలే, అంబేద్కర్ ఆశయాలకు తిలోదకాలు ఇస్తూ దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బిజెపి పాటుపడుతున్నదని చెప్పారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక న్యాయాన్ని సాధించడానికి పూలే, అంబేద్కర్ జన జాతర సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభలో కెవిపిఎస్ హైదరాబాద్ నగర కార్యదర్శి, బి సుబ్బారావు, మేడ్చల్ జిల్లా ధ్యక్షులు ఎం. కృపాసాగర్, బాలపీరు, నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఇనార్బిట్‌లో 'ది గ్రీన్ ఫ్లీ' ప్రారంభం

హైదరాబాద్ : పర్యావరణ అనుకూల జీవనాన్ని ప్రోత్సహించడంతో పాటుగా, స్థానిక హరిత బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడానికి వీలేగా ది గ్రీన్ ఫ్లీని ప్రారంభించిన ట్లు ఇనార్బిట్ మాల్, సైబరాబాద్ తెలిపింది. ఈ నెల 27 వరకు జరుగనున్న ఈ కార్యక్రమం అన్ని వయసుల పర్యావరణ ప్రేమికులకు ఉత్సాహ భరితమైన, సుసంపన్న మైన అను భవాన్ని అందిస్తోందని పేర్కొంది. దీనిలో సేంద్రీయ దుస్తులు, ఉపకరణాల నుండి బయోడి గ్రేడబుల్ హోమ్‌వేర్, సహజ సౌందర్య ఉత్పత్తుల ఎన్నో ప్రదర్శించనున్నట్లు పేర్కొంది.

ఈ ప్రాంతాలను సందర్శించండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ సమ్మిట్ సందర్భంగా శనివారం హైదరాబాద్‌కు విచ్చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా వ్యాంగ్యాస్త్రాలు సంధించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ పాలనలోని పలు సంఘటనలను ప్రస్తావించారు. "తెలంగాణలోని ఈ ప్రాంతాలను సందర్శించండి. లగచర్ల గ్రామం, సుంకిశాల, హైడ్రా కూల్చేసిన ప్రాంతాలు, హెచ్‌సియు కంచ గచ్చిబౌలి, ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన గురుకుల విద్యార్థుల కుటుంబాలు, ఆత్మహత్య చేసుకున్న 500కి పైగా రైతు కుటుంబాలు అంటూ పలు సంఘటనలను ప్రస్తావించారు. ఈ ప్రాంతాల్లో పర్యటించడం ద్వారా మీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన నష్టాన్ని మరింత బాగా తెలుసుకోవడానికి మీకు అద్భుతమైన సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి కెటిఆర్ అన్నారు. ఇది కుదరకపోతే ఈడీ కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో మీ రెవెన్యూ మంత్రిని అడిగి తెలుసుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

సాంకేతికతతో నీటిపారుదల ఆధునీకరణ

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృత్రిమ మేధస్సు, డ్రోన్లు, జియోగ్రాఫిక్ సమాచారంతోపాటు ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నీటిపారుదల రంగాన్ని ఆధునికరించనున్నట్టు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రోజున రాష్ట్ర రక్షా విశ్వవిద్యాలయంతో కలిసి నిర్వహించిన కృత్రిమ మేధస్సు అంశంపై హైటెక్స్‌లో జరిగిన డ్రోన్ ఎక్స్‌పో సదస్సు-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడంతోపాటు సుస్థిరమైన గ్రామీణాభివద్ధిని ప్రోత్సహించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుందన్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత డ్రోన్ అప్లికేషన్లు తదితర అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో మౌళిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నదన్నారు. నీళ్ల, భూమి మేనేజ్మెంట్ శిక్షణ పరిశోధన సంస్థను(వాలంతరీ) బలోపేతం చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆధునిక నీటి నిర్వహణ సాగునీటి పద్దతులపై పరిశోధనలో ఈ శిక్షణా కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోబోతున్నామన్నారు. డ్రోన్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. పంటలను పరిరక్షించడంతో పాటు సారవంతమైన భూములను గుర్తించడం, సాగునీటి నిర్వహణలో సరికొత్త మెలకువలను గుర్తించడం వంటి వాటిపై ప్రత్యేక దష్టి సారించ నున్నట్టు ఆయన తెలిపారు. కేవలం సాంకేతిక పరిజ్ఞానం మీదనే ఆధార పడకుండా డ్రోన్ ఎక్స్‌పో లాంటి సదస్సులతో స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పారిశ్రామికవేత్తల తదితరులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి పరస్పరం సమన్వయం చేయడం ద్వారా అద్భుతమైన ఫలితాలు రాబట్టవచ్చని ఆయన తెలిపారు. డ్రోన్ ఎక్స్‌పో అనేది కేవలం ఈవెంట్‌కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణ లో కొనసాగుతున్న పురోభివద్ధికి కేంద్రంగా నిలుస్తుందని మంత్రి ఆకాంక్షించారు.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు పత్రికా ప్రకటన
IN THE COURT OF THE FAMILY
CUM VIII ADDL. DISTRICT
JUDGE:ONGOLE
EA NO 164/2024
E.P No. 709/2022
Between
వేముల శ్రీకాంత్ ...... పిటిషనర్ /డి.హెచ్.ఆర్
And
కుంచాల వెంకటేశ్వర్లు మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు/జె.డి.ఆర్.లు
To
2వ రెస్పాండెంట్
తన్నీరు సుబ్బలక్ష్మి W/o శ్రీనివాసరావు.
వయస్సు 48 సంవత్సరాలు, గృహిణి,
R/o ప్లాట్ నెం.32, 2nd ఫేస్, జెపినగర్,
తిరుమలగిరి,మియాపూర్,
హైదరాబాద్-500049. తెలంగాణా రాష్ట్రము.
4వ రెస్పాండెంట్
బత్తుల సుజాత W/o రాంబాబు
వయస్సు 48 సంవత్సరాలు, గృహిణి,
R/o ప్లాట్ నెం. 32, 2nd ఫేస్, జెపినగర్,
తిరుమలగిరి, మియాపూర్,
హైదరాబాద్ -500049, తెలంగాణా రాష్ట్రము.
పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పై ఇ.ఎలో 2వ మరియు 4వ రెస్పాండెంట్లు అయినమీకు పై ఇ.ఎలో నోటీసులు ఎన్ని పర్యాయములు పంపినను జారీ కానందున మీకు నోటీసు మరియు మీ హాజరు నిమిత్తమై పైకోర్టు వారు తే.09-05-2025 దికి పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు కొరకు ఆర్డరు వేసియున్నారు. కావున తే:09-05-2025దిన మీరు స్వయంగా గాని మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టులో హాజరుపడి పైఇ.ఎ విషయమై మీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసు కొనగలరు. లేని యెడల కోర్టువారు పైఇ.ఎని మీపరోక్షములో విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
వాయిదా తేది : 09-05-2025
ఉదయం 10:30 గంటలకు.
ఇట్లు
విరిగినేని నరసింహారావు
జాజుల మాధురి, కొమ్మాలపాటి ప్రమీలరాణి,
Ch.బాబురావు, S.మమత, P.వెంగళరావు
పిటిషనరు తరపు న్యాయవాదులు,ఒంగోలు
ఫోన్ : 9440077226

పేదల భూములకు పట్టాలివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- భూముల రక్షణ కోసం మరో ఉద్యమం
- కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం
- దేశం వెలిగిపోతే 'ఉపాధి' డబ్బులెందుకు ఇవ్వరు?
- వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్

బహిరంగసభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వందల ఎకరాలు కలిగిన వారి నుంచి భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంచాలి.. సామాన్యులకు అందుబాటులో ఉండేలా నిత్యావసరాల ధరలు దించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని కోరుతూ.. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. డబ్బులున్న వారి మేలు కోసం పనిచేస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమించాలన్నారు. ఫాసిస్టు విధానాలతో ముందుకు వెళ్తున్న కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కులమతాల మధ్య ఘర్షణలు పెట్టి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అవలంభిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో ఇండ్లు, స్థలాలు, పని హక్కు కోసం ఆందోళనలు చేస్తామన్నారు. గుడిసె లేని దేశంగా తీర్చిదిద్దుతామని మోడీ.. ప్రతి ఒక్కరికీ రెండు పడకల గదులు ఇస్తామన్న కెసిఆర్ మాటలు నీటి మూటలుగా మిగిలాయన్నారు. రేషన్ కార్డులతో పాటు కేరళ తరహా 14 నిత్యావసర సరుకులను పౌరసరఫరాల శాఖ ద్వారా అందజేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం కోసం ప్రతి కుటుంబానికీ లక్షలు ఖర్చువుతున్నాయని, వీటిని ఉచితంగా అందించాలని కోరారు. ఉపాధి, సమాజిక న్యాయం కోసం, అసమానతలను తగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు.

ప్రజాస్వామ్య మనుగడకు ప్రశ్నార్థకంగా బిజెపి విధానాలు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు ప్రజాస్వామ్య మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మారుమూల ప్రాంతమైన నారాయణపేట జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి 1850 ఎకరాలు స్వాధీనం చేసుకోవడం చారిత్రాత్మక విజయం అన్నారు. ఉపాధి, హక్కుల కోసం పోరాడేది ఒక్క ఎర్రజెండానే అని చెప్పారు. దేశంలో భూ చట్టాలు, కౌలుదారీ చట్టం కమ్యూనిస్టుల పోరాటాల వల్లే వచ్చాయని గుర్తు చేశారు. అయితే, గతంలో పోరాటాలు చేసి సాధించుకున్న భూములను ఇప్పుడు పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో పాలకులు లాక్కుంటున్నారని, అందువల్ల భూముల రక్షణ కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో మరో ఉద్యమం చేపట్టామన్నారు. అమెరికా అధ్యక్షులు మన దేశ వస్తువులపై అధిక పన్నులు వేశారని, దీనిపై ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అమెరికా విధానాలపై అనేక దేశాలు మౌనం పాటించినా.. కమ్యూనిస్టు దేశమైన చైనా.. అమెరికాను సవాల్ చేసేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం సద్దుమణిగితే వచ్చేది ఎర్రజెండేనని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సిఎం రేవంత్‌రెడ్డి వేగం పెంచాలని కోరారు. ఫార్మాసిటి కోసం 13500 ఎకరాలు మాజీ సీఎం కెసిఆర్ తీసుకుంటే, రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక మరో 30 వేలు కలిపి 43వేల ఎకరాలతో స్మార్ట్‌సిటీ పేరుతో పేదల భూములను లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. దేశం వెలిగిపోతుందన్న మోడీ ఉపాధి కార్మికులకు కూలీ డబ్బులు కూడా వేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల దేశంలో 10 కోట్ల మందికి నాణ్యమైన ఆహారం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేషన్ షాపుల్లో సన్నబియ్యంతోపాటు 14 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 20శాతం మంది దగ్గర 80 శాతం ఆస్తులు ఉన్నాయని, వాటిని 80 శాతం మందికి పంచేందుకు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మే1 నుంచి చేపట్టనున్న గ్రామీణ ఉద్యమాల్లో భాగంగా భూములను ప్రభుత్వం పంచేలా పోరాటం చేయాలని అన్నారు. బహిరంగ సభకు ముందు భారీ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి ఉడ్మలగిద్ద గోపాల్, గౌరవాధ్యక్షులు పి.వెంకట్‌రాములు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, భూబాధితుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, గొర్రెల కాపర్ల సంఘం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, సిపిఎం గద్వాల జిల్లా కారదర్శి వెంకట స్వామి, అమరచింత మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జీఎస్ గోపీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంజిలయ్య, కార్యదర్శి బాల్‌రాం, బాలప్ప, మహిమూద్, మహేష్, మల్లన్న, పద్మ, ప్రసాద్, పొన్నం పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయంలోగా సమస్యలు పరిష్కరించండి

- డిఎంఇకి టిటిజిడిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్దిష్ట సమయంలోగా సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిటిజిడిఎ) కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్‌కు అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల నేతృత్వంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తానని డిఎంఇ హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. బదిలీల గురించి ప్రస్తావించగా, జూన్ మాసంలో జనరల్ ట్రాన్స్‌ఫర్ల కోసం మంత్రి సానుకూలంగా ఉన్నట్టు తెలిపారు. పెరిఫెరియల్ మెడికల్ కాలేజీల అలవెన్స్ కోసం గిరిజనశాఖ ద్వారా ఆర్థిక మంత్రిత్వశాఖను కోరుతున్నట్టు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ కోసమే అడిషనల్ డిఎంఇ పదోన్నతులను పెండింగ్‌లో పెట్టినట్టు డిఎంఇ తెలిపారు. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల పదోన్నతుల కోసం సిద్ధపడుతున్నట్టు చెప్పారు. ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, రవాణా అలవెన్స్ అమలు కోసం సంబంధిత కాలేజీలకు సర్క్యులర్ జారీ చేస్తానని డిఎంఇ హామీ ఇచ్చారు.

ఐఐటి పూర్వ విద్యార్థితో కెఎల్‌హెచ్ గ్లోబల్ స్కూల్ జట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఐఐటి ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక వ్యవస్థాపకుడు డాక్టర్ వైవి సతీష్ కుమార్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు) చేసుకున్నట్లు కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కెఎల్‌హెచ్ జిబిఎస్) ప్రకటించింది. పరిశ్రమ నైపుణ్యాన్ని విద్యా కార్యాచరణలో మిళితం చేయటం ద్వారా, ఆర్థిక, ఫిన్‌టెక్, వ్యాపార విశ్లేషణలపై ప్రత్యేక దృష్టి సారించడం, విద్యార్థులకు ఆచరణాత్మక, వాస్తవ ప్రపంచ బహిర్గతం అందించడం ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం లక్ష్యమని ఆ సంస్థ తెలిపింది.

యుటిఎఫ్ వ్యవస్థాపకులు రావెళ్ల మృతి

- సంతాపం వ్యక్తం చేసిన టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుటిఎఫ్ వ్యవస్థాపకులు, ఖమ్మం జిల్లా తొలి కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం శ్రీనివాస్ నగర్‌కు చెందిన రావెళ్ల రాఘవయ్య (90) వయో భారంతో మరణించారు. మృతదేహాన్ని శనివారం టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని అధ్యక్షత నిర్వహించిన సంతాప సభలో చావ రవి, పోతినేని సుదర్శన్ మాట్లాడారు. రాఘవయ్య మరణం యుటిఎఫ్ సంఘానికి, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర నష్టమని అన్నారు. రాఘవయ్య ఇద్దరు కుమార్తెలను, కుమారులను ఉన్నత ఆశయాల వైపు పయనింపజేశారని చెప్పారు. వారి కుటుంబం మొత్తం వివిధ ప్రజాతంత్ర ఉద్యమాలకు అండగా నిలబడిందని, ఇలాంటి తరుణంలో ఆయన మరణం బాధాకరమని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దారని సంతాప సభలో వక్తలు కొనియాడారు. నేటి సమాజం రాఘవయ్యను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి

- హైదరాబాద్‌లో భారీ ర్యాలీ

AIMSS
హైదరాబాద్‌లో జరిగే 72వ మిస్‌వరల్డ్
అందాలపోటీలను రద్దు చేయాలి!
మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచే అందాలపోటీలను బహిష్కరించండి!
మహిళలను విలాస వస్తువుగా దిగజార్చే సామ్రాజ్యవాద విషసంస్కృతి నశించాలి!
ర్యాలీ
26 ఏప్రిల్ 2025
ఉదయం 10 గం॥లకు
సుందరయ్య పార్క్ నుండి

నిరసన ర్యాలీ చేపట్టిన మహిళా, సాంస్కృతిక, కళా, ప్రజా సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే ప్రపంచ సుందరి పోటీలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మహిళా, సాంస్కృతిక, కళా, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్డు మీదుగా ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అందాల పోటీలకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. సనాతన ధర్మ సంస్థాపకులుగా చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం అందాల పోటీలను నిర్వహించడం అందులో భాగమా? స్త్రీల అంగాంగ ప్రదర్శననే సనాతన ధర్మమా? ఇది భారతదేశ సంస్కృతికి నిదర్శనమా? అని ప్రశ్నించారు. ఈ పోటీలు భారతదేశంలో నిర్వహించడం ఇది మూడోసారన్నారు. రైతుల ఆత్మహత్యలు, లైంగికదాడులు, నిరుద్యోగం లాంటి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి రావడం లేదా? అని నిలదీశారు. ఉద్యోగులకు, పెన్షనర్‌లకు సక్రమంగా వేతనాలు, పెన్షన్లు చెల్లించలేని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని ప్రభుత్వం చెబుతూ ఈ పోటీల కోసం వందల కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించడం వెనుక ఉన్న కుట్రను అర్థం చేసుకుని.. రాజకీయ, బహుళజాతి వ్యాపార సంస్థల స్వప్రయోజనాలను తిప్పికొట్టాలంటూ పిలుపునిచ్చారు. తెలంగాణ మహిళ ఆత్మగౌరవ పోరాటానికి స్ఫూర్తి అని, అంగాంగ ప్రదర్శనకు కాదన్నారు. అందాల పోటీలు వుమెన్ ఎంపవర్‌మెంటుకు సంకేతం కాదని చెప్పారు. హైదరాబాద్‌లో జరుగబోయే 72వ ప్రపంచ సుందరి పోటీలకు వ్యతిరేకంగా తెలంగాణ మహిళా, సాంస్కృతిక, కళా, ప్రజా సంఘాల ప్రతినిధులు ముక్త కంఠంతో పిలుపునిచ్చారు. ఈ నిరసన ర్యాలీలో పిఒడబ్ల్యూ జాతీయ నాయకులు సంధ్య, రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, చైతన్య మహిళా సంఘం నాయకులు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య నాయకులు విమలక్క, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంస్థ నాయకులు హేమలత, స్త్రీ విముక్తి చైతన్య సంఘం తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఇన్‌ఛార్జ్ స్పెషల్ కమిషనర్‌గా వినయ్‌కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్‌గా పంచాయతీరాజ్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది. అలాగే ఎక్స్ అఫిషియో కార్యదర్శిగా కూడా పని చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో పని చేస్తున్న ప్రస్తుత ప్రత్యేక కమిషనర్ డాక్టర్ ఎస్.హరీష్ నెలరోజులపాటు సెలవులో అమెరికా వెళుతున్న నేపథ్యంలో ఇన్‌ఛార్జి నియామకం అవసరమైంది. హరీష్ తిరిగి వచ్చే వరకు వినయ్‌కృష్ణారెడ్డి బాధ్యతల్లో ఉంటారని ప్రధానకార్యదర్శి జిఒ నెంబరు 507లో పేర్కొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతి వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్‌టికెట్లను http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఎన్‌డిఎస్‌ఎ ఎఫెక్ట్

- ఇరిగేషన్ ఇఎన్‌సి హరిరాంపై ఎసిబి కేసు
- కాళేశ్వరానికి ప్రజాధనం వృథా
- కమిషన్ల నివేదికలే సాక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల కుంగుబాటుపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక ప్రభావం ప్రారంభమైంది. గతంలో విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా తాత్కాలిక ప్రాతిపదికన చర్యలు తీసుకున్న సర్కారు, ఇప్పుడు ఎన్‌డీఎస్‌ఎ నివేదిక ఆధారంగా పావులు కదుపుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవినీతి జరిగినట్టు ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అప్పట్లో కాళేశ్వరం ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసిన హరిరాంపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కేసు నమోదు చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే పేరుతో శనివారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఎసిబి తనిఖీలు నిర్వహించింది. నీటిపారుదల శాఖ రాష్ట్ర కార్యాలయం జలసౌధ నుంచి అవసరమైన సమాచారం తీసుకున్న ఎసిబి కొరడా ఝులిపించింది.

పక్కా సమాచారంతోనే

హైదరాబాద్‌లోని హరిరాం నివాసంతోపాటు ఆయన పని చేసిన, ప్రస్తుతం చేస్తున్న కార్యాలయాలు, ఆయన భార్య అనిత పని చేస్తున్న రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వాలంతరి కార్యాలయం నుంచి సమాచారం సేకరించినట్టు తెలిసింది. హరిరాం భారీగా ఆస్తులు కూడబెట్టారనేది ఎసిబి ప్రధాన విమర్శలు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో సోదాలు జరుగుతున్నాయి. శనివారం అర్థరాత్రి కొనసాగాయి. అదంతా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సంపాదించిందేనని ఎసిబి భావిస్తున్నది. ఆ మేరకు కొందరు ఫిర్యాదు సైతం చేసినట్టుగా తెలిసింది. ఈనేపథ్యంలో ఏకంగా పలుచోట్ల తనిఖీలు చేపట్టింది. సోదాలకు ముందే సమగ్ర సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఎన్‌డిఎస్‌ఎ నివేదిక కాళేశ్వరం భవిష్యత్‌ను తేల్చేసిందనే వ్యాఖ్యానాలు మాజీ ఇరిగేషన్ ఇంజినీర్లు, సాగునీటిరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పనికిరాదు

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రాదని ప్రభుత్వం వేసిన మూడు కమిషన్లు సూచిస్తున్నాయి. విజిలెన్స్ కమిషన్ గత మార్చి 22న నివేదిక ఇస్తూ 17 మంది ఇంజనీర్ల కేసులు పెట్టాలనీ, అలాగే మరో 30 మందిపై శాఖాపరమైన చర్యలు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టిపై కఠినంగా వ్యవహరించాలని చెప్పింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారించిన విజిలెన్స్ కమిషన్, మాజీ ఇఎన్‌సి మురళీధర్, ప్రస్తుత సిఇ సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నివేదికపై ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే ఇటీవల ఎన్‌డిఎస్‌ఎ సంస్థ, 378 పేజీల తుది రిపోర్టును ప్రభుత్వానికి అందజేసింది. కాళేశ్వరం మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకూడదని నివేదికలో హెచ్చరించిది. మేడిగడ్డ బ్యారేజీ ఏడవ బ్యారేజీ పూర్తి తొలగించాలనీ, దీంతో ఇతర బ్యారేజీలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చింది. ఏడవ బ్లాకులో మాదిరిగా మిగతా బ్లాకుల్లో జరగవనే గ్యారంటీ లేదని కూడా ఆ నివేదిక స్పష్టం చేసింది. ఇంత ప్రమాదం జరిగినా బీఆర్‌ఎస్ మాత్రం చిన్న సమస్యను పెద్దది చేస్తున్నారనే ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. చివరికి జస్టిస్ పిసి ఘోష్ న్యాయ విచారణ కమిషన్ కూడా నిర్మాణాలపై విచారణ సందర్భంగా అసంతృప్తి వెలిబుచ్చుతున్నది.

బ్యారేజీలకే రూ. 20 వేల కోట్లు

ప్రాజెక్టులో పెట్టిన రూ.1.05 లక్షల కోట్లల్లో రూ. 20 వేల కోట్లు ఈ మూడు బ్యారేజీలకే ఖర్చుపెట్టారు. ఈ మూడింటిని వదిలేయడం మంచిదని విచారణ సంస్థలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్వహణ మూలంగా ఎకరానికి రూ. 40 వేల ఖర్చును ప్రభుత్వం భరించాల్సి వస్తుందని గతంలోనే 'కాగ్' నివేదిక సైతం చెప్పిన విషయమూ విదితమే. ఈ మూడు డ్యామ్‌లను వదిలేసి ప్రాణహిత నుంచి ఎల్లంపల్లికి 110 కిలోమీటర్లల్లో 70 కిలోమీటర్ల మేర ఇప్పటికే కాలువ తవ్వారు. ఆదిలాబాద్ జిల్లా మైలారం వద్ద 20 మీటర్ల ఎత్తు లిఫ్ట్ పెట్టడం ద్వారా ప్రాణహిత-ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తవుతుంది. దీని నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 8000 ఖర్చు చేస్తే సరిపోతుందని సమాచారం. ప్రాణహిత నీరే మేడిగడ్డకు రావడం మూలాన నీటి లభ్యతలో 10 నుంచి 12 టీఎంసీలు మినహా పెద్దగా నష్టం జరగదని నీటిపారుదల నిపుణులు సైతం అభిప్రాయపడున్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక సైతం అదే చెప్పింది. ప్రాణహిత వద్ద నీరు సముద్ర మట్టానికి 148 మీటర్లు ఎత్తులో ఉండగా, ఎల్లంపల్లి దగ్గర కూడా 148 మీటర్లేనని నివేదిక స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో మైలారం దగ్గర 20 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేస్తే సరిపోతుందని కేంద్ర నీటిపారుదల శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ గతంలోనే చెప్పారు. మరో 15 రోజుల్లో గోదావరికి వరద రావడం, ఆ వరదలకు మరింత నష్టం జరిగే అవకాశం ఉన్నదని విచారణ కమిషన్లు సైతం చెబుతున్నాయి.

నిపుణుల సూచన మేరకే

సాంకేతికంగా సిడబ్ల్యూసితో సహా అన్నీ సాగునీటి సంస్థలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పున:రుద్దరణ సాధ్యం కాదంటూ సలహాలు, సూచనలు ఇస్తున్నాయి. అన్నారంకు పెద్దబుంగపడి నీరంతా బ్యారేజీ వెనుకకు వస్తున్నది. అది బుంగ పెరగడంతో బ్యారేజీ కుంగుబాటుకు అవకాశం ఉంది. సాగునీటిపారుదల నిపుణులు ఇచ్చిన సలహాలేగాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిషన్ ఎన్‌డీఎస్‌ఏ, జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిషన్లు ప్రాజెక్టును ఉపయోగించకూడదని చెబుతున్నాయి. వీటిని వదిలేయడం మూలాన ప్రభుత్వానికి రూ.17000 కోట్ల నష్టం మాత్రమే వస్తుందని అంచనా వేస్తున్నారు. మూడు బ్యారేజీల మోటారు పంపులను మరోచోట వినియోగించుకునే అవకాశముంది. వందల ఏండ్లుగా గోదావరికి వరదలు రావడంతో, నదిలో అసలు నెలపై వందలాది అడుగుల ఇసుక పేరుకుపోయింది. గోదావరికి అడ్డంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టరాదని అనేకమంది సలహాలు ఇచ్చారు. కాకతీయ కాలంలో నిర్మించిన పాకాల, రామప్ప, లక్నవరం నదులకు ఎదురుకాకుండా పక్కన కట్టడంతో నీటికి పూడిక రాలేదు. గోదావరికి వస్తున్న పూడికలతో శ్రీరాంసాగర ప్రాజెక్టు నీటివిలువ 120 టీఎంసీల ఉంచి 85 టీఎంసీలకు తగ్గింది. ఈ వాస్తవాల ఆధారంగా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు కృషి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం, క్లాక్ టవర్ వద్ద గల స్టే ఇన్ హోటల్, సరయు హాల్లో రెండ్రోజులపాటు జరుగుతున్న ఉద్యమ తరగతులు శనివారం మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా పనిచేస్తున్న టిఎస్‌యుటిఎఫ్.. ఉద్యమ తరగతులలో ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించడానికి ప్రణాళికలు రూపొందించాలని, దాని కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్దులై పనిచేయాలని తెలియజేశారు. సమాజంలో జరుగుతున్న అనేక అంశాల్లో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని, శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

16 నెలలు దాటినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కాలేదు : చావా రవి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు దాటినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కాకుండా ఎక్కడివక్కడే ఉన్నాయని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి అన్నారు. ఇప్పటికే ఐదు డిఎలు, పిఆర్‌సి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు రెండు సంవత్సరాల నుంచి ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉండి అకౌంట్లో జమ కావడం లేదని, వెంటనే విడుదల చేయాలని లేనిచో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ శిక్షణా తరగతులలో ప్రభుత్వ విద్యారంగం, శాస్త్రీయ ఆలోచన, సంఘ నిర్మాణం, నిబంధనలు, సర్వీస్ లీవ్ రూల్స్ మీద చర్చించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులకు హక్కులతోపాటు బాధ్యతలపై కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ON
SCIENCE SUMMER CAMPS
26th & 27th April, 2025
@ Pragathi Vidya Nikethan, Pragathi Nagar, Hyderabad
JANA VIGNANA VEDIKA TELANGANA
Telangana State Committee
(Affiliated to AIPSN)

సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్ రెడ్డి

కరోనా మరణాల కంటే రోడ్డు ప్రమాదాలే అధికం

- రాష్ట్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో కరోనా మరణాల కంటే అత్యధికంగా రోడ్డు ప్రమాదాల్లో జరుగుతున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ బి.జనార్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రగతినగర్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ వేసవి రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు ఎదుటి వారు ప్రమాదానికి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల నుంచి ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సమాజానికి మేలు చేసిన వారమవుతామన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు సైన్స్‌తోపాటు రోడ్డు ప్రమాదాలపై కూడా అవగాహన కల్పించాలని, ఇది కూడా సైన్స్‌లో భాగమేనని అన్నారు. సర్వేజనా ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న స్టాప్ యాక్సిడెంట్స్ అనే మొబైల్ అప్లికేషన్‌ను ఈ సందర్భంగా ఆయన జన విజ్ఞాన వేదిక సభ్యులందరితో ఇన్ స్టాల్ చేయించి రోడ్డు ప్రమాదాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. సంస్థ మాజీ అధ్యక్షులు, విద్యాశాఖ రాష్ట్ర సబ్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ కోయా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జెవివి ప్రతి ఏటా ఎండాకాలంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నదని, అవి సజావుగా జరిగేటట్టు టీచర్లకు ముందస్తుగా వర్క్‌షాప్ కండక్ట్ చేస్తోందని తెలిపారు. రోజువారి జీవితంలో సైన్స్ పాత్ర, దైనందిన జీవితంలో భౌతిక శాస్త్రం, డ్రాయింగ్, ఓరిగామి, కథారచన, పాటలు వంటి వివిధ అంశాల్లో శిక్షణ పొందుతారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ రజనీ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం నేతలు

ఉగ్రదాడిపై సమగ్ర విచారణ జరపాలి

- చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- సంగారెడ్డిలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసి అత్యంత కిరాతకంగా హతమార్చిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, దాడిపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల చుక్క రాములు ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పహల్గాం ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతం మినీ స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిందని, నిత్యం వేలాదిమంది పర్యాటకులు సందర్శిస్తారని తెలిపారు. ప్రశాంతమైన ప్రాంతం ఉగ్రవాదుల దాడితో హింసాత్మకంగా మారిందన్నారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దుర్మార్గమని, పిరికి పందల చర్య అని అన్నారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించాలన్నారు. ఇది ప్రజాస్వామ్యం మీద దాడి అని అన్నారు. ఈ చర్య వల్ల పర్యాటకులు, ఆ ప్రాంత ప్రజల మనోధైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, భద్రతా వైఫల్యాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ మాట్లాడుతూ.. ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మల్లేశం, అతిమేల మాణిక్, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, రేవంత్, కృష్ణ, నాయకులు అశోక్, బాలరాజు, శివ, నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, హన్మంతు, దత్తు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.